క్లుప్తంగా

కస్తూర్బాలో ప్రవేశానికి గడువు పొడిగింపు

అనుమసముద్రంపేట: మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 20వ తేదీ వరకు పెంచినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ బైపీసీలో 40 సీట్లు విద్యార్థులకు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు వారి ఆధార్‌కార్డు, తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు, కుల, ఆదాయ సర్టిఫికెట్లు, రేషన్‌కార్డు జెరాక్స్‌లతో ఆన్‌లైన్ లేదా పాఠశాల ఆఫీసులో గడువులోపు తమకు దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

కేజీబీవీలో దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ టి.జయంతి మంగళవారం తెలిపారు. 6వ తరగతి ప్రవేశంలో 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటి కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు పొంగూరులో గడప గడపకు మన ప్రభుత్వం

మర్రిపాడు: మండలంలోని పొంగూరు సచివాలయ పరిధిలో బుధ, గురువారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ పథకాలు అన్ని కుటుంబాలకు అందాయని, ఇంకా మెరుగైన సేవలు కావాలనే ఉద్దేశంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి ఎమ్మెల్యే ప్రతి కుటుంబం వద్దకు వస్తున్నారన్నారు. బుధ, గురువారాల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చేపట్టే ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలన్నారు.

వలంటీర్లకు సేవా పురస్కారాలు

చేజర్ల: ప్రజలకు సేవా దృక్పథంతో దగ్గరగా సేవా కార్యక్రమాలు చేసిన వలంటీర్లకు సేవా పురస్కారాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని ఎంపీడీఓ విజయలలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 237 మంది వలంటీర్లు ఉండగా 178 మందికి సేవా మిత్ర, ఐదుగురికి సేవారత్న పురస్కారాలు లభించాయని ఆమె తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

చేజర్ల: మండలంలోని మాముడూరు కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 112 రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు రమాదేవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మస్తాన్‌వలి

ఉదయగిరి: దేశ వ్యాప్తంగా ఎంతో చరిత్ర కలిగి ఉన్న కాంగ్రెస్ పార్టీకి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు స్థానిక ఆల్‌ఖైర్ ఫంక్షన్ హాలులో జరిగిన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ ఇష్టానుసారంగా చమురు, ఆయిల్, నిత్యావసర సరుకుల ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తోందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి రాంగోపాల్‌రెడ్డి, రంగస్వామి, జిల్లా మహిళా అధ్యక్షురాలు లతారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి దుద్దుకూరి రమేష్‌నాయుడు, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ అరాచకాలను అడ్డుకుంటాం

ఆత్మకూరు: బీజేపీ రాష్ట్రాల హక్కులను తుంగలో తొక్కుతూ అరాచకాలకు పాల్పడుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి అన్నారు. ఆత్మకూరు పట్టణంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేవూరు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశం మంగళవారం నిర్వహించారు. దివంగత ఇందిరా గాంధీ, జ్యోతిరావుపూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, స్థానిక నాయకులు వన్నం నాగరాజు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

ఉదయగిరి: బైక్ అదుపుతప్పి పడిన ఘటనలో ఒక వ్యక్తి గాయపడిన పడ్డాడు. ఈ ఘటన మంగళవారం స్థానిక వ్యవసాయ కళాశాల సమీపంలో జరిగింది. మండలంలోని శకునాలపల్లికి చెందిన అవుల కృష్ణయ్య సున్నంవారిచింతలలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి బయలుదేరగా బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు.

జ్యోతిరావు పూలే అందరికీ ఆదర్శం

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- వాడవాడల ఘనంగా పూలే జయంతి



ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో పూలే జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం



ఆత్మకూరు రూరల్: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ తదితరులు



సోమశిల: పూలే చిత్రపటానికి నివాళులు

ఆత్మకూరు: మొట్ట మొదటగా స్త్రీ విద్యకు బాటలు వేసిన వ్యక్తి ప్రముఖ సామాజిక తత్త్వవేత, సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శమని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కొనియాడారు. జ్యోతిరావు పూలే 197వ జయంతిని పురస్కరించుకుని ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సాధు కరుణకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, ఇన్‌చార్జి కమిషనర్ ఏఈ ప్రసాద్, ఎ.ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, ఐవీ రమణారెడ్డి, జమీర్, కలాం, కౌన్సిలర్లు పెంచలయ్య, మహబూబ్‌బాషా, తిరుపతమ్మ, వెంకటేశ్వర్లు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు హమీద్ విద్యార్థులతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలేను ఆదర్శంగా తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు.

ఉదయగిరి: ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్, మండలంలోని బిజ్జంపల్లిలో మంగళవారం బీజేపీ, సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో వేర్వేరుగా మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే 195 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, కేవీకృష్ణ, బీజేపీ నాయకులు కె.వెంకటరంగారావు, ఎం.మాల్యాద్రినాయుడు, ఏ రోశయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, షాజహాన్ పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త పూలే

ఆత్మకూరురూరల్: దురాచారాలు రాజ్యమేలుతున్న రోజుల్లో మహాత్మా జ్యోతిరావు పూలే ధైర్యంగా చేపట్టిన చర్యలు తదనంతర కాలంలో సమాజానికి మార్గదర్శకమయ్యాయని ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులు మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఉషా రాణి, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులురెడ్డి, సాంకేతిక సహాయకుడు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి పల్లవోలు భాస్కర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు మండలంలోని పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని టీజేఎస్ ఉన్నత పాఠశాలలో పూలే చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూలే చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



కావలి: ఎమ్మెల్యే కార్యాలయంలో పూలే జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

బోగోలులో పూలే జయంతి

బిట్రగుంట: బోగోలు మండలంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పూలే చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలతో నివాళి అర్పించారు. బోగోలు ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలే జయంతి వేడుకలను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ చంద్రశేఖర్, జైభీమ్ సేవాదళం అధ్యక్షుడు బత్తల రవిచంద్ర తదితరులు పాల్గొని నివాళి అర్పించారు.

కావలి: కావలిలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పూలే చిత్రపటం ఏర్పాటు చేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రావణసేవ



రావణసేవ నిర్వహిస్తున్న దృశ్యం

సంగం: పినాకిని నదీతీరంలో కొలువైన సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి నిర్వహించిన రావణసేవ అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలోని దేవదేవేరులను రావణుని వాహనంపై ఉంచి విశేష పూలతో సుందరంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు గోపాలకృష్ణమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భారీగా అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులు

సంగం: సంగం ఇరిగేషన్ కార్యాలయం వద్ద కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇరిగేషన్ ఏఈ కృష్ణ సిబ్బంది అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇరిగేషన్ డీఈ మధు అన్నదానం చేశారు. బ్రిటిష్ కాలం నుంచి బ్రహ్మోత్సవాల్లో ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఏఈ కృష్ణ తెలిపారు. మూడు రోజుల పాటు ఈ అన్నదానాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి రిజర్వాయర్ ఏఈ వినయ్, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

- అడిషనల్ డీఎంహెచ్ఓ వెంకటప్రసాద్



చిత్తలూరు పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ వెంకటప్రసాద్

చేజర్ల: వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆత్మకూరు డివిజన్ ప్రోగ్రామ్ ఆఫీసర్, అడిషనల్ డీఎంహెచ్ఓ జి.వెంకట ప్రసాద్ అన్నారు. మంగళవారం చేజర్ల మండలంలోని చిత్తలూరు, చేజర్ల పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. అటెండెన్స్, ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం వైద్యం కోసం వైద్యశాలకు రోగులు వస్తుంటారని, వారికి కావాల్సిన వైద్య పరీక్షలు చేసి మందులు ఇవ్వాలన్నారు. రెండు రోజులుగా జిల్లాలో కరోనా కేసులు నమోదవుతున్నాయని, లక్షణాలు ఉంటే కోవిడ్ పరీక్షలు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాపిడ్ కిట్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. 104 వాహనంలో ఒక డాక్టర్ పీహెచ్‌సీ స్టాఫ్ కచ్చితంగా ఉండాలన్నారు. చేజర్లలో ప్రస్తుతం ఒక డాక్టరే ఉన్నారని, రెండో డాక్టర్‌ని త్వరలో ఏర్పాటు చేస్తానని తెలిపారు. చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భవనం ఉరుస్తుందని, సెకండ్ ఫేజ్‌లో నాడు-నేడు పనుల్లో భాగంగా ఆరోగ్య కేంద్రాన్ని మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చిత్తలూరు వైద్యాధికారిణి జ్యోతి, డాక్టర్ పవన్‌కుమార్ రెడ్డి, సూపర్‌వైజర్ షంషుద్దీన్, సీహెచ్ఓ కే చంద్రయ్య, స్టాఫ్ నర్సు ఉమామహేశ్వరి, ఫార్మాసిస్ట్ హెప్సిబా, లాబ్ టెక్నీషియన్ సుజాత, పీహెచ్ఎన్ రమణమ్మ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మేకపాటితో స్థానిక నేతల భేటీ



మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న పంచాయతీ పాలకవర్గం

కలిగిరి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో కలిగిరి సర్పంచ్ రాగి దివ్య, ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ పాలక మండలి సభ్యులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీగా ఉన్న సమయంలో కలిగిరి పంచాయతీ అభివృద్ధికి పూర్తి సహకారం అందించారన్నారు. అభివృద్ధి పనులకు ఎంపీ నిధులు కేటాయించారని గుర్తు చేసుకుని కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీ మేకపాటిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


అడవుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న రేంజర్ ఉమామహేశ్వరరెడ్డి

ఉదయగిరి: అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై నిఘా ఏర్పాటు చేసి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఉదయగిరి అటవీ రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వేసవి దృష్ట్యా అడవులు అగ్నికి ఆహుతి కాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. వన్యప్రాణులు తాగునీటి కోసం గ్రామాల్లోకి వస్తే వాటిని సంరక్షించాలని, వేటాడితే కేసులు నమోదు చేస్తామన్నారు. అడవుల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వన్యప్రాణులు వేటాడేందుకు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు అడ్వాన్స్‌డ్ సెన్సిటివ్ సర్క్యూట్ బ్రేకర్స్ విధానాన్ని ఏర్పాటు చేసేందుకు ఆయా శాఖల అధికారులతో చర్చిస్తున్నామన్నారు. ఈ విధానం వల్ల షాక్‌కు గురైన వన్యప్రాణి ప్రాణాలు రక్షించుకునే అవకాశం ఉంటుందన్నారు. డీఆర్వో శ్రీనివాసులు, ఎస్ఎస్ఓలు బోగ్యం శ్రీనివాసులు, చినవెంకటయ్య, ఎఫ్‌బీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



తొగటపాళెంలో మెట్టుకూరు చిరంజీవిరెడ్డి

వింజమూరు (ఉదయగిరి): రాష్ట్రంలోని ప్రతి పేదవానికి సంక్షేమ ఫలాలు అందిస్తూ సంక్షేమ సారథిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి అన్నారు. వింజమూరు మండలం బుక్కాపురం సచివాలయ పరిధిలోని తొగటపాళెంలో ఇంటింటికీ వెళ్లి జగనన్నే భవిష్యత్తు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లాల కొండారెడ్డి, వనిపెంట వెంకటసుబ్బారెడ్డి, తాటిచెట్ల కాలేషా, సర్పంచ్ రసూల్, ఖాజారెడ్డి, కాటం రమణారెడ్డి, తమిదల విజయ్, యర్రా భాస్కర్‌నాయుడు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నమ్మకానికి నిదర్శనం సీఎం జగన్



దుత్తలూరు మండలంలో ధనుంజయరెడ్డి

దుత్తలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకానికి నిదర్శనమని ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దుత్తలూరు బీసీకాలనీ, రాచవారిపల్లి, ముత్తరాశిపల్లి గ్రామాల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు బీసీ కాలనీలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చేజర్ల జయంతిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చేజర్ల చలమారెడ్డి, ఉండేల గురవారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు వాసిపల్లి వెంకటేశ్వరరెడి పాల్గొన్నారు.

కలిగిరి: మండలంలోని వీరారెడ్డిపాళెంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం 'జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ములకా శ్రీనివాసులురెడ్డి, స్థానిక నాయకులు నర్రావుల అంకిరెడ్డి, యలపల తిరుపాలు, నోటి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. కలిగిరిలో ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి ఆధ్వర్యంలో 'జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ వార్డు సభ్యులు గునపాటి మహేష్‌రెడ్డి, పుల్ల రవి, పీఏసీఎస్ డైరెక్టర్ బాపతు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం: కొండాపురం ఎస్టీ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చిమ్మిలి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఎస్టీ కాలనీలో ప్రతి ఇంటికీ వెళ్లి స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో గుడవళ్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడు వీరవల్లి మాధవరావు, సచివాలయ కన్వీనర్ బాలచంద్రప్రతాప్ పాల్గొన్నారు.

సచివాలయాల్లో డీఎల్‌డీఓ తనిఖీలు

బిట్రగుంట: బోగోలు మండలం ముంగమూరు, ఏనుగులబావి సచివాలయాలను కావలి డీఎల్‌డీఓ కనకదుర్గాభవానీ మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులు, సిబ్బంది హాజరు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఆధార్ సర్వీసులు, వివాహ రిజిస్ట్రేషన్లు, ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయాల ద్వారా మెరుగైన, వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు.

ఘనంగా కిసాన్ 86వ ఆవిర్భావ దినోత్సవం

ఆత్మకూరు: ఆత్మకూరు సీపీఎం, రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో అఖిలభారతకిసాన్ 86వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పంటవీధిలో పతాకావిష్కరణ చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ కిసాన్ సభ ద్వారా ఉద్యమాలు చేపట్టి ఎన్నో రైతు సమస్యలు ప్రభుత్వాలు గుర్తించేలా చేసి పరిష్కరించినట్లు పేర్కొన్నారు. నాయకులు లక్ష్మీపతి, చేవూరు రామకృష్ణారెడ్డి, నాగేంద్ర, చెర్లో సుబ్బరామిరెడ్డి, చిట్టమూరు సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, పఠాన్ పాల్గొన్నారు.

17న మండల పరిషత్ సమావేశం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 17న జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఉపాధి హామీ, గృహ నిర్మాణ, నీటి పారుదల, పంచాయతీరాజ్, విద్యుత్, రోడ్డు భవనాలు, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ తదితర శాఖలకు సంబంధించి అంశాల వారీగా చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు. సంబంధిత అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

రేపటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వంపై సమీక్ష

చేజర్ల: గడప గడప మన ప్రభుత్వంపై మండలంలోని పలు గ్రామాల్లో 13వ తేదీ నుంచి సమీక్షలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ పాడేరు, 19న యనయదల, 20 మాముడూరు, 25న నాగులవెలటూరు, 27న నెర్నూరు, 29న ఏటూరు సచివాలయాల పరిధిలో మధ్యాహ్నం 3.30 గంటలకు జరుగుతాయని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఆవుల హంతకులను శిక్షించండి

ఉదయగిరి: అక్రమంగా ఆవుల్ని చంపి మాంసం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంగళవారం బీజేపీ నాయకులు సీవి వి.గిరిబాబు, అటవీశాఖ రేంజ్ అధికారి టి.ఉమామహేశ్వరరెడ్డిలకు వినతిపత్రాలు అందించారు. దుత్తలూరు మండలం జంగాలపల్లి, తురకపల్లి గ్రామాల్లో ఇటీవల కొందరు వ్యక్తులు అడవులకు మేతకు వెళ్లిన ఆవులకు విద్యుత్ తీగలు అమర్చి హతమారుస్తున్నారన్నారు.

అర్హులు అందరికి సంక్షేమ ఫలాలు



ఆత్మకూరులో గడప గడపకు కార్యక్రమంలో రాజస్థాన్ కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- మున్సిపల్ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం


ఆత్మకూరు: పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తూ ఆ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం కూడా తాము మీకు ఈ మంచి చేశామని, మీకు చేరాయా? మీరు సంతృప్తికరంగా ఉన్నారా లేదా అని తెలుసుకునేందుకు ధైర్యం చేయాలేదన్నారు. ఎమ్మెల్యేలు ధైర్యంగా ప్రజల ఇళ్లకే వెళ్తున్నామంటే ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు గీటురాయిగా ఎమ్మెల్యే అభివర్ణించారు. పట్టణంలోని 3,4 వార్డుల పరిధిలో మంగళవారం సాయంత్రం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు ఇప్పటి వరకు అందిన సంక్షేమ ఫలాల కార్డులను చూపి వారి ద్వారా ప్రభుత్వంపై అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. తాను ఇప్పటి వరకు 42 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు, ఇళ్ల వద్ద ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిపక్ష నాయకుడు సెల్ఫీ ఛాలెంజ్‌ల ప్రచారం చేస్తున్నారని సెల్ఫీ ఛాలెంజ్‌తో కాకుండా మాతో పాటు గడప గడపకు తిరిగితే ఏ మేరకు ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి జగనన్నపై సానుకూల వాతావరణం ఉందన్న విషయం ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చునన్నారు. ప్రజలు, ప్రతిపక్షాల దుష్ప్రచారాలను నమ్మబోరని రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం 75 శాతానికి మించి ఉందని, అమ్మఒడి, విద్యాదీవెన, నాడు-నేడు, తదితర పథకాలతో ఇది సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు విద్యావకాశాల కోసం పెట్టుబడి పెడుతుందని వాటి ఫలితాలు భవిష్యత్‌లో కనిపిస్తాయన్నారు.

ఇతర రాష్ట్రాల వారికి సంక్షేమం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఇంటింటికి వెళ్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి దృష్టికి రాజస్థాన్ రాష్ట్రం నుంచి జీవనం కోసం ఆత్మకూరులోని జేఆర్‌పేటలో 19 ఏళ్ల క్రితం చేరిన రాజేశ్వరి కుటుంబ సభ్యులకు సంక్షేమ పథకాలు అందుతుండడంపై ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అప్పట్లో ఇక్కడికి వచ్చిన ఆ కుటుంబం చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా ఆధార్ రేషన్‌కార్డులు, మంజూరయ్యాయి. దీంతో సంక్షేమ పథకాలకు అర్హత ఏర్పడింది. వారు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డితో ఎలాంటి రికమండేషన్లు లేకుండా అర్హతతోనే తమకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తమ పిల్లలు స్థానిక పాఠశాలల్లో చదువుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈకార్యక్రమంలో చైర్ పర్సన్ జి వెంకటరమణమ్మ, కౌన్సిలర్ కోడూరు కౌసల్యమ్మ, పార్టీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, రిజ్వాన్, రహీం, కలాం, జమీర్, షబ్బీర్, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, పూసల వెంకట రమణ, సురేష్ యాదవ్, నందవరం ప్రతాప్, వల్లెపు వెంకటేశ్వర్లు, వి.లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయ అభివృద్ధికి కృషి

- సంగమేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే మేకపాటి



ఆలయంలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: దక్షిణకాశీ క్షేత్రంగా విరాజిల్లుతున్న త్రివేణి సంగమం ఒడ్డున కొలువైన సంగమేశ్వరుడి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే సంగమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ సంప్రదాయం ప్రకారం ధర్మకర్త రవీంద్రబాబు సీనియర్ నాయకుడు కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి నేతలతో కలిసి వెళ్లి స్వాగతం పలికారు. అనంతరం సంగమేశ్వరుడిని, కామాక్షితాయి అమ్మవార్ల వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ విశిష్టత గురించి ప్రధాన అర్చకులు టంగుటూరి గోపాలకృష్ణమూర్తి ఎమ్మెల్యేకు వివిరంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంగమేశ్వరాలయాన్ని బ్రహ్మోత్సవాల సమయంలో తొలిసారి దర్శించుకోవడం సంతోషమన్నారు. సంగం బ్యారేజీ నుంచి హైవేకు ప్రత్యేక రోడ్డు వేసేందుకు రూ.15 కోట్లు అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. ఆలయ విశిష్టత తెలియజేస్తూ వారణాసిలో జరిగే విధంగా ఇక్కడ కూడా జరిగేలా, ఇందు కోసం కేంద్ర ప్రభుత్వానికి రూ.20 కోట్లు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదించామన్నారు. ఈ కార్యక్రమంలో కూనం సుధాకర్ రెడ్డి, జనార్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.